



విజ్ఞానశాస్త్రం ఎంతగా పురోగమించి, మానవ ప్రగతికి దోహదం చేస్తున్నా—ఈ పరిణామాలను అర్థంచేసుకోలేని అజ్ఞానులు—ఇంకా అర్థరహిత మైన విశ్వాసాలతోనూ, మూఢనమ్మకాలతోనూ ఎందరో జీవితాలలో చెలగాటాలు ఆడుతూనేవు న్నారు. ఈ అంధ విశ్వాసాలను అధిగమించి, భవిష్యత్తుపట్ల ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయ గలిగే యువతరం మధ్యాహ్నమార్తాండునిలా విజృంభిస్తే—ఎంతటి అజ్ఞానాంధకారమైనా పటా పంచలు కాకతప్పదు.

బస్సు కదిలింది!

అప్పటిదాకా బస్సు ఎప్పుడు కదులుతుందా అని నిరీక్షించి నిరీక్షించి విసిగిపోయి వున్న శిరీషా, వినోద్ హుషారుగా సర్దుకుని కూర్చున్నారు!

పిల్లల హుషారు చూసిన మాలతి మనసు మాతృ త్వపు మృదుత్వంతో ఆర్ద్రమై, పెదవుల మీద మనోహర మైన చిరునవ్వుగా మారింది! తనకి సృష్టికంతటికీ అపూరూపమైన మాతృత్వాన్ని ప్రసాదించిన భగవంతు ణ్ణి చూస్తున్నట్టు, ప్రక్కనే కూర్చున్న భర్త వైపు ఆరాధనగా చూసింది!

మాలతి మనసు గ్రహించినట్టు అతనూ చిరునవ్వు నవ్వేడు.

రివ్వుమని ముందుకి దూసుకుపోతున్నట్టుగా పరిగె డుతున్న బస్సులో కూర్చుని అతన్ని చూస్తుంటే మాలతి కి ఎంత మర్చిపోదామన్నా మరపురాని గతం మళ్లీ కళ్ల ముందు తిరిగింది.

* * *

"ఏమన్నారు పెళ్లివారు?" భర్తకి మంచి నీళ్లగ్లాసు అందిస్తూ అడిగింది మాలతి తల్లి వరలక్ష్మి.

"ఏమంటారు.... పెళ్లి చూపులకి వస్తామన్నారు! అయితే మనం యిప్పటి వరకూ మాలతికి చూసిన సంబంధాలన్నింటిలోకీ యిది చాలా నయమనుకో! వాళ్లు చాలా ఆధునిక స్వభావం గల వాళ్లలా వున్నారు! కట్నం అక్కర్లేదుట. జాతకాల పట్టింపు లేదుట! పిల్లా-పిల్లవాడూ ఒకరికొకరు నచ్చితే చాలుట! పెళ్లి చూపులకి కూడా ఎక్కువ మంది రారుట! పెళ్లి కొడుకు, అతని చెల్లెలు మాత్రం వచ్చి చూస్తారుట. పెళ్లి కొడుక్కి నచ్చితే మిగతా వాళ్లంతా నిశ్చయ తాంబూలాలు తీసు కునేటప్పుడు వస్తారుట!" మంచినీళ్ల గ్లాసు కింద పెడుతూ గుక్క తిప్పుకోకుండా చెప్పేశాడు కాశీపతి.

నోరు తెరుచుకుని వింటున్న వరలక్ష్మి దేవుడే దిగివ చ్చినంత ఆశ్చర్యంగా, "నిజమేనా యిదంతా?!" అంది. కాశీపతి నవ్వుతూ. "నిజం కాకపోతే కల అనుకుంటున్నా వేమిటి?. ఇదంతా మాలతి అదృష్టమనుకో! మన కుటుంబరావుగారు కూడా ఆ మాటే అన్నారు. "ఇ దంతా మీ మాలతి అదృష్టం అనుకోండి. ఆ పిల్ల అదృష్టం తన్నుకు రాబట్టే మీకా సంబంధం గురించి చెప్పాలని నాకు బుద్ధి పుట్టింది! ఇంక ఆ కుర్రాడికి మాలతి నచ్చటమూ, పెళ్ళి జరిగిపోవటమూ క్షణాల మీద పని అన్నారు!" అన్నాడు.

వరలక్ష్మి నసుగుతూ, "అది కాదండీ కుటుంబరావుగా రికి ఈ పెళ్లివారు బాగా తెలుసా అని..." అంది.

"అంటే...?" అర్థంకాక కనుబొమలు ముడుస్తూ అడి గాడు కాశీపతి.

వరలక్ష్మి నసుగుతూనే చెప్పేసింది. "అబ్బే... నయా పైసా కట్నం వద్దంటున్నారు. జాతకాల పట్టింపు లే దంటున్నారు... యిదంతా మంచితనమేనా... లేకపోతే ఆ పిల్లాడిలో ఏమైనా లోపం వుందా అని..."

కాశీపతి ఖంగుతిన్నాడు!

"ఓసి నీ అనుమానాలు తగలెయ్య! ఈ పిశాచం ఎక్కడ పట్టుకుందే నిన్ను?! ఇదిగో చూడు, కుర్రాడు సలక్షణంగా వుంటాడు! నేను నా కళ్లారా చూశాను! ఇక కుటుంబరావుగారికి వాళ్లు పది సంవత్సరాల నుంచి తెలుసు! ఇంత మంచి పెళ్లికొడుకు ఎక్కడా దొరకడని ఢంకా బజాయించి చెబుతున్నాడాయన! అంచేత ఇంక నీ అనుమానాలు పక్కన పెట్టి కాస్త కళ కళ్లాడుతూ వుండు!" అన్నాడు.

"సర్లేండి! ఏదో తల్లిని కాబట్టి దాని సౌఖ్యం కోసం కొట్టుకులాడి నోరు జారాను! నాకేం నోరు తీటెక్కిందా ఏం అందర్నీ ఆడిపోసుకోవటానికి!!" అంటూ గొణుక్కుంటూ లోపలికి వెళ్లిపోయింది వరలక్ష్మి.

మరి కాస్సేపటికి మాలతి స్కూలు నించి వచ్చింది! కూతురు కాస్త మొహం అదీ కడుక్కుని స్తిమిత పడ్డాక పిలిచాడు కాశీపతి.

"ఇలా కూర్చోమ్మా..." కుర్చీ చూపించాడు కాశీపతి.

"ఏమిటి నాన్నా..." అంటూనే కూర్చుంది మాలతి.

"చూడమ్మా మీ అమ్మ ఒట్టి వెర్రిమాలోకం! నీకు చెప్పే విధంగా చెప్పటం అంటే దానివల్ల అయ్యే పనికాదని నేనే చెబుతున్నాను! మన కుటుంబరావు మామయ్యగారు నీకో సంబంధం చూశారు. ఆ కుర్రాడు బి.ఎల్.పాసై, ఈ వూళ్లోనే లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నా డు. పేరు శశాంక. కుర్రాడు బావుంటాడు! ఇవేళ నేను, మామయ్యగారూ వెళ్లి వాళ్లని పెళ్లి చూపులకి ఆహ్వా నించి వచ్చాం! వాళ్లు మంచి రోజు చూసుకుని ఎప్పుడు వచ్చేదీ మామయ్యగారి ద్వారా తెలియజేస్తామన్నారు..." అంటూ ఆగాడు కాశీపతి.

అప్పటికే మాలతి మొహం కాస్త ఎర్రబడింది.. తన ముఖంలో భావాలని కప్పిపుచ్చుకుంటూ ప్రశ్నార్థకంగా చూసింది.

కాశీపతి నవ్వుతూ, "ఈ సంబంధం గురించి మీ అమ్మకి కొన్ని అభ్యంతరాలున్నాయి. అవేమిటో తెలుసా?" అన్నాడు.

"ఏమిటి?" తన ఆతృతని వ్యక్తపరచకుండా వుండటా నికి విఫలయత్నం చేస్తూ అడిగింది మాలతి.

"వాళ్లు కట్నం తీసుకోమన్నారు! అదొక అభ్యంతరం! వాళ్లకి జాతకాల పట్టింపులేదుట! అది యింకా పెద్ద అభ్యంతరం!" నవ్వుతూనే అన్నాడు కాశీపతి.

"యివా అభ్యంతరాలు" మాలతి నవ్వింది.

కాశీపతి గంభీరంగా, "అవునమ్మా! ప్రపంచంలో నగటు మనిషి ఎలా ఆలోచిస్తాడో మీ అమ్మ అలాగే ఆలోచిస్తోంది! ఆ కుర్రాడిలో ఏదో లోపం వుండబట్టే వాళ్లు యిన్ని కన్సెషన్స్ యిస్తున్నారని, గబాయించి ఏమి అడగటంలేదని అనుకుంటోంది. అందుకే నిన్ను అడుగుతున్నాను. నీ అభిప్రాయం ఏమిటి తల్లీ! నువ్వూ మీ అమ్మతో ఏకీభవిస్తావా?" మాలతి తల వంచుకుని, "మంచితనాన్ని లోపంగా పొరబడే ఉద్దేశ్యం నాకు లేదు! అంతే కాదు మీరు చెప్పే యీ శశాంక లాయర్ కె.శశాంక మోహన్ అయినట్లయితే... అతను నాకు తెలును!" అంది.

కాశీపతి ఆనందాశ్చర్యాలతో "నీకు తెలుసా? ఎలా?" అన్నాడు.

"అతను నాకు కాలేజీలో రెండేళ్లు సీనియర్! మీరూ అతన్ని చూశారు!"

"అవును కదూ?! ఎక్కడో చూసినట్టుందని అను కుంటూనే వున్నాను! మీ కాలేజీ ఏనివర్సరీడేకి వచ్చిన ప్పుడు చూశాను! మామయ్యగారు అంటూనే వున్నారు కూడాను. 'మాల చదివిన కాలేజీలోనే అతనూ చదివాడ య్యా" అని. అయితే నీకేమీ అభ్యంతరం లేనట్టే కదమ్మా?!"

మాలతి చిరునవ్వుతో తల వూపింది!



– లక్ష్మీగాయత్రి

శుభం! ఇంక మరో నెలా రెణ్ణెల్లలో నీ పెళ్లి అయిపోయినట్టే..." ఆనందంగా లేచాడు కాశీపతి.

* * *

అనుకున్న వన్నీ అనుకున్నట్టు జరిగిపోతే జీవితం యింత ఆకర్షణీయంగా వుండనే వుండదు!

శశాంక మరో వారం రోజుల్లోపలే మాలతిని చూసుకోవటానికి చెల్లెలితో కలిసి వచ్చాడు!

శశాంక, మాలతి ఒకరినొకరు కళ్లతోనే పలకరించుకున్నారు.

"నేనంటే నీ కిష్టమేనా?" శశాంక కళ్లు మృదువుగా పలకరించాయి.

అతని పేరులోని ' వెన్నెల చల్లదనాన్నంతటినీ తమలో నింపుకుని స్నిగ్ధంగా జవాబిచ్చాయి మాలతి కళ్లు.

మరో రెండు రోజుల కల్లా మాలతి శశాంకకి నచ్చిందని, మాలతి అభిప్రాయం కూడా తెలుసుకుని, ప్రదానానికి ముహూర్తం పెట్టించమని పెళ్లివారు చెప్పారన్న కబురు తీసుకు వచ్చాడు కుటుంబరావు.

మాలతి మనసు మేఘమాలికలా తేలిపోయింది! కూతురి అదృష్టానికి అంతకంటె ఎక్కువగా సంతోషించారు మాలతి తలిదండ్రులు.

ఇరుగు పొరుగు వాళ్లంతా మాలతిని, ఆమె తల్లి దండ్రుల్ని వారి అదృష్టానికి అభినందించారు! "పైసా కట్నం లేదా? జాతకాలు కూడా చూపించుకోలేదూ? ఇదెక్కడి విడ్డూరమమ్మా? లేనిపోని ఫేషన్లకి పోక పిల్లాడి జాతకాన్ని ఒక్కసారి పంతులుగారికి చూపించండి. ఇదంతా బడాయో, బండారమో తెలిసిపోతుంది!" అంటూ వరలక్ష్మిలాగే అనుమానపడి సలహా యిచ్చారు కొంతమంది.

వరలక్ష్మి ఉండబట్టలేక మళ్లీ కాశీపతి దగ్గర జాతకాల ప్రస్తావన ఎత్తింది.

"చూడు లక్ష్మీ! శశాంక తండ్రి బాగా చదువుకున్నవాడు! మంచి సంస్కారవంతుడు. ఆయనే జాతకాల ప్రస్తావన తేనప్పుడు నా అంతట నేను అడగటం ఎంత చిన్నతనంగా వుంటుందో ఆలోచించు! అంతేకాదు. ఒక రకంగా ఆలోచిస్తే మాలతికి, శశాంకకి బ్రహ్మరాసి పెట్టి వుంటే నువ్వు ఏ జాతకాలు చూపించినా ఏ తావేదులు కట్టించినా వాళ్లు దంపతులవక తప్పదు. విధి వాళ్ల-జీవితాల్లో రాసిపెట్టిన సుఖ దుఃఖాల్ని అనుభవించకా తప్పదు! నీకింకా అంత కోరికగా వుంటే, ప్రధానం అయిన తరువాత ముహూర్త నిర్ణయంకోసం ఎటూ జాతకం యిస్తారు గాబట్టి, అప్పుడు కుర్రవాడి జాతకం ఎలావుందో చెప్పమని శాస్త్రులుగార్ని అడుగుతాను! సరా?! అదీ నీ తృప్తికోసం! ఈ విషయం మాత్రం ఎక్కడా టాం టాం వెయ్యకు!" అన్నాడు కాశీపతి.

వరలక్ష్మి తృప్తిపడి వెళ్లిపోయింది.

మరో పది రోజుల్లో ప్రధానం జరిగిపోయింది!

మాలతికి ముత్యపుటుంగరం, కంచిపట్టుచీరా పెట్టి తమ కోడలనిపించుకుని వెళ్లారు, శశాంక తల్లిదండ్రులు!

శాస్త్రులుగార్ని సంప్రదించి, నాలుగైదు ముహూర్తాలు పెట్టించుకు వస్తానని చెప్పాడు కాశీపతి.

ప్రధానం అయిన మర్నాడు స్కూల్‌కి వెళుతున్న మాలతికి ఏక్సిడెంట్ అయింది! జీవన్మృత్యు సరిహద్దు వరకూ వెళ్లి బ్రతికి బైటపడింది. ఒక కాలు ఫ్రాక్చర్ అయి మంచాన పడింది.

ఏక్సిడెంట్ అయిన పదిహేను రోజుల తర్వాత ఒక రోజు, తన గదిలో మంచంమీద పడుకుని రేడియోలో పాటలు వింటున్న మాలతి బైటనించి ఏవో మాటలు వినిపించటంతో రేడియో వాల్యూం తగ్గించి చెవులు రిక్కించింది.

"మాలతి నిద్రపోతోంది నాయనా!" వరలక్ష్మి ఎవరితోనో చెబుతోంది.

మాలతి ఆశ్చర్యపోయింది. తను నిద్రపోతోందా? ఇప్పుడే కాఫీ యిచ్చి వెళ్లిన అమ్మ కావాలని అలా ఎందుకు చెబుతోంది. ఇంతకీ ఎవరతను?

"మాలతి లేస్తే నేను వచ్చి వెళ్లానని చెప్పండి అత్తయ్యగారూ! మళ్లీ రేపు వస్తాను!" అది శశాంక గొంతు.

మాలతి కొయ్యబారి పోయింది! తను నిద్రపోతోందని అమ్మ అబద్ధం చెబుతున్నది శశాంకతోనా?! లేచి వెళ్లలేని తన అశక్తతకి విలవిల్లాడిపోయింది మాలతి.

తర్వాత వరలక్ష్మి మాటలు వినిపించలేదు! శశాంక స్కూటర్ చప్పుడు, వరలక్ష్మి తలుపు వేసిన శబ్దం వినిపించాయి.

"అమ్మా... అమ్మా..." వరలక్ష్మి లోపలికి వచ్చిన అలికిడి వినబడగానే గట్టిగా పిలిచింది మాలతి.

"ఆఁ వస్తున్నానే... ఏమిటా కేకలు?" అంటూ వచ్చింది వరలక్ష్మి.

"ఎవరు వచ్చారిప్పుడు?" నిలదీస్తున్నట్టు అడుగుతున్న మాలతి ప్రశ్న వినగానే తడబడినా సర్దుకుంది వరలక్ష్మి.

"ఎవరో... ఎవరిదో యిల్లు కావాలని వచ్చారు..." ధైర్యంగా చెబుతున్న తల్లిని చూసి మరోసారి విస్తుపోయింది మాలతి. ఆమె అనుమానం ధృవపడింది. "అమ్మా వచ్చింది శశాంక అని నాకు తెలుసు! నేను నిద్రపోతున్నానని అతని దగ్గరా, ఎవరో వచ్చారని నా దగ్గరా అబద్ధాలు ఎందుకాడుతున్నట్టు నువ్వు?"

అసలు విషయం మాలతికి తెలిసిపోయిందని గ్రహించగానే మొండితెగింపుతో విరుచుకుపడింది వరలక్ష్మి.

"అబద్ధాలు ఎందుకాడుతున్నానా? నోరు కొవ్వింది తల్లీ! అందుకు! పదిహేను రోజుల క్రితం చస్తావో బతుకుతావో అని నెత్తీ నోరూ కొట్టుకుని కన్న కడుపు కోసం ఏడ్చానుకదూ?! ఈ వేళ కాస్త ఒంటికి రక్తం పట్టగానే నేను చేదయ్యాను! అబద్ధాలాడుతున్నానట అబద్ధాలు! అబద్ధాలాడాల్సిన ఖర్మనాకు లేదు. రేపు అతగాడొస్తే, "నాయనా, నీకూ నీ సంబంధానికీ ఓ పెద్ద నమస్కారం! నువ్వు మాలతిని చూడక్కర్లేదు. ఎవర్నీ చూడక్కర్లేదు. వెళ్లిరా" అని మొహం మీద చెప్పి తలుపు వేసుకుంటాను!" అని అరుస్తూనే గదిలోంచి వెళ్లిపోయింది వరలక్ష్మి.

మాలతికి ఒక్కసారి మనసు మొద్దుబారిపోయి కాలం స్తంభించి పోయినట్టుగా అయింది! క్షణ క్షణానికీ కళ్లల్లో నుళ్లు తిరుగుతున్న నీటిని బలవంతంగా అదిమిపెట్టుకుంటూ తండ్రి వచ్చేదాకా క్షణం ఒక యుగంగా గడిపింది.

కాశీపతి వచ్చిన అలికిడి కాగానే, "నాన్నా..." అంటూ గట్టిగా పిలిచింది.

"ఆఁ... ఆఁ... ఏమిటమ్మా..." మాలతి కేకకి ఖంగారు పడుతూ పరిగెత్తుకు వచ్చాడు కాశీపతి.

"నాన్నా... అమ్మ ఏమంటోందో విన్నారా?" కళ్లల్లో నుళ్లు తిరుగుతున్న నీటిని బలవంతంగా అణిచిపెట్టుకుంటూ అంది మాలతి.

కాశీపతికి అర్థమైంది!

"శశాంక విషయమేనా తల్లీ" లాలనగా అడిగాడు.

మాలతి అవునన్నట్టుగా తల వూపింది!

"ఆ గొడవ యిప్పుడెందుకమ్మా! ఎటూ నువ్వా లేచి తిరిగేదాకా ఏ ప్రస్తావనా లేదు కదా?!" మృదువుగా అన్నాడు కాశీపతి.

తండ్రి వచ్చి "అదంతా మీ అమ్మ చాదస్తం తల్లీ! మీ అమ్మ వెర్రి నీకు తెలియనిదా?! మరేం భయంలేదు, నువ్వే ఆలోచనలూ పెట్టుకోకు!" అంటాడని ఎంతో ఆశతో ఎదురు చూసిన మాలతి ఆ చిగురాశ కూడా అంతరించిపోగా దుఃఖం ఆపుకోలేకపోయింది.

"ఇప్పుడే ప్రస్తావనా లేని మాట నిజమే నాన్నా! కాని, శశాంక మీకొక 'గొడవ'గా కనబడుతున్నాడా లేదా చెప్పెయ్యండి చాలు!" అంది కన్నీళ్ళు చెక్కిళ్ళ మీదకి జారుతుండగా.

ఏదో ఒకటి తేలనిదే కూతురు వదిలిపెట్టదని గ్రహించాడు కాశీపతి. కూతురు ప్రక్కన కూర్చుంటూ, "చూడమ్మా. తల్లి దండ్రులుగా మేం కోరేది నీ సుఖాన్ని మంచిని మాత్రమే అన్న సంగతి ఒప్పుకుంటావా?" అన్నాడు నచ్చజెబుతున్న ధోరణిలో.

"నాన్నా నాకు ఎలాగోలా నచ్చజెప్పి ఒప్పించాలని చూడకండి! నాకు జరిగిన ఈ అనర్థానికి శశాంకే కారణం అని మీరు అనుకుంటారని నాకు స్పృహ వచ్చిన మరుక్షణంనించీ భయపడుతూనే వున్నాను! నాన్నా ఒక్కటి ఆలోచించండి! శశాంక జాతక ప్రభావం ఏదో నా మీద పడి నాకు ఏక్సిడెంట్ అయిందని భావిస్తున్నారు మీరు! నా జాతకంలోనే నాకు మృత్యువు రాసి పెట్టి వుంది. అది శశాంక జాతక ప్రభావం వల్ల పెద్ద గండంతో తప్పిందని ఎందుకు ఆలోచించరు? ఈ ప్రపంచంలో జరిగే ప్రతి సంఘటనకీ రెండు కోణాలుంటాయి. చెడువైపునించే ఆలోచిస్తారుగాని, మంచి ఎందుకు చూడరు నాన్నా?" మాలతి ఆవేశంగా అంది.

"కీడెంచి మేలెంచమన్నారు గదమ్మా..."

"గిన్నెమీద మూత పెట్టకపోతే ఏ పురుగో పడవచ్చునన్న విషయానికి ఆ సామెత వర్తిస్తుంది గాని, జీవితానికి వర్తించదు నాన్నా! పోనీ మరొక్క విషయం చెప్పండి. ఈ ఏక్సిడెంట్ నాకు గాకుండా శశాంకకి జరిగి వుంటే కూడా మీరిలాగే ఆలోచించి వుండేవారా? నా దురదృష్టజాతకం వల్లే అతనికి ఏక్సిడెంట్ అయిందని చెప్పి నన్ను అతనికిచ్చి పెళ్లి చెయ్యటం మానేసేవారా? చెప్పండి నాన్నా!"

కాశీపతి మౌనం వహించాడు.

మాలతి మళ్లీ ఏదో మాట్లాడబోయేంతలో, బైటనించి దూసుకు వచ్చిన వరలక్ష్మి, "ఇదుగో, చూడు తల్లీ! బైటనించి నీ మాటలన్నీ నేను వింటూనే వున్నాను! నువ్వు చాలా తెలివైనదానివనీ మహబాగా వాదించగలవనీ తెలుసుగానీ, నేను చెబుతున్నాను, విను! నువ్వు లక్ష చెప్పినా, కోటి చెప్పినా సరే, మాకు ఒక్కగా నొక్క బిడ్డవి. నీ సుఖం మాకు ముఖ్యం గాని నువ్వు చెప్పే సిద్ధాంతాలు కాదు! నా కంఠంలో ప్రాణం వుండగా శశాంకతో నీ పెళ్లి జరగదు! చాలా?! ఇక కళ్లుమూసుకుని పడుకో!" అంది.

"ఏం నాన్నా. మీరు చెప్పేదీ యిదేనా?" అంది మాలతి.

కాశీపతి నెమ్మదిగా లేచాడు. "చూడు తల్లీ, నీకు ఒక్కగానొక్క బిడ్డవుడితే, నలుగురూ క్షేమం కాదని చెవినిల్లు కట్టుకుని పోరుతున్నా సరే బిడ్డ క్షేమం గురించి ఆందోళన పడకుండా ఆ పని చెయ్యగలవో లేదో తెలుస్తుంది! ఈ నాన్నకి నువ్వంటే ఎంత ప్రేమో ఆ కోణంలోంచి ఆలోచించు తల్లీ..." అంటూ కళ్లలో తిరుగుతున్న నీరు ఎవరికంటా పడనివ్వకుండా గబగబా వెళ్లిపోయాడు.

వరలక్ష్మి భర్త వెనకే వెళ్లిపోయింది!

ఈసారి మాలతికి దుఃఖం రాలేదు! మనసంతా గడ్డకట్టుకు పోయినట్టు అనిపించింది. ఆ స్థితిలో చాలాసేపు గడిచాక, మాలతికి సడెన్‌గా గుర్తొచ్చింది శశాంక రేపు వస్తానన్న సంగతి.

"నాన్నా!" అంటూ పిలిచింది.

"ఆ... వస్తున్నానమ్మా..." అంటూ వచ్చేడు కాశీపతి.

"నాన్నా ఇందాక శశాంక వచ్చారు! అమ్మ నేను నిద్రపోతున్నానని చెప్పి పంపించేసింది. రేపు మళ్లీ వస్తానని చెప్పారు. రేపు వస్తే దురుసుగా ఏమీ మాట్లాడకుండా ఏదో అబద్ధం చెప్పమని చెప్పండి! వీలైతే ఈ లోపలే వాళ్లకి యిది తిప్పి పంపించెయ్యండి!" అంటూ వేలినున్న ముత్యపుటుంగరం తీసి తండ్రి చేతిలో పెట్టి కళ్లు మూసుకుంది మాలతి.

కాశీపతి మౌనంగా ఉంగరం తీసుకుని వెళ్లిపోయాడు.

మాలతి మర్నాడు అప్రయత్నంగా శశాంక కోసం ఎదురు చూసింది!

అయితే, శశాంక రాలేదు! మర్నాడే కాదు ఆ తర్వాత కూడా రాలేదు!

* * *

ఇంచుమించుగా మరో సంవత్సరం తరువాత మాలతికి రమేష్‌తో పెళ్లి నిశ్చయమైంది!

రమేష్ స్టేట్ బాంక్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. ఒక్కతే చెల్లెలు. ఆమెకి పెళ్లై విజయవాడలో వుంటోంది. ప్రస్తుతం ఐదోనెల. రమేష్, అతని చెల్లెలు శిల్ప తప్ప యింకెవరూ సంతానం లేరు వాళ్లకి. బాగా వున్న కుటుంబమే.

రమేష్, అతని తల్లిదండ్రులు, మేనమామ, అతని భార్య అంతా వచ్చి మాలతిని చూసుకుని తృప్తిపడ్డారు. మాలతి జాతకాన్ని వాళ్ల జ్యోతిష్కులకి చూపించారు. కాశీపతి కూడా ఈసారి ముందుగానే రమేష్ జాతకం అడిగి తీసుకుని పండితులకి చూపించాడు. ఈతతంగాలన్నీ అయిన తరువాత పాతికవేల కట్నం వెండి కంచం, వెండి చెంబు, ఆడబడుచుకి వెయ్యి నూటపదహార్లు యిచ్చి యితర చిల్లర లాంఛనాలన్నీ జరిపించేందుకు కాశీపతి సంసిద్ధంగా వున్నట్టయితే మాలతిని తమ కోడలుగా చేసుకునేందుకు సిద్ధంగా వున్నామని కబురు పంపించారు.

కాశీపతి అంగీకరించాడు!

మాలతి పెళ్లి రమేష్‌తో నిశ్చయమైపోయింది!

అంతా సవ్యంగా జరిగితే మాలతి పెళ్లి తిరుపతి కొండమీద చేస్తానని వరలక్ష్మి మొక్కుకుంది! ఆ ప్రకారమే పెళ్లి కొండమీద చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయి!

పెళ్లివారి బస్సులు కొండమీదకి బైలుదేరాయి. కొండ మీదికి వెళ్లటానికి రెండు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశాడు కాశీపతి. మగపెళ్లివారు ఒకదాంట్లో, ఆడపెళ్లివారు ఒకదాంట్లో బైలుదేరారు.

ఏడుకొండల వాడి సన్నిధికి బైలుదేరిన ఆ రెండు బస్సుల్లో మగపెళ్లివారు బైలుదేరిన బస్సుకి మూడవ కొండ ఎక్కుతుండగా చిన్న ఏక్సిడెంట్ జరిగింది. చాలా చిన్న ఏక్సిడెంటే. ఎవరికీ అట్టే దెబ్బలు కూడా తగల్లేదు. కానీ, అన్నగారి పక్కనే కూర్చుని అన్నగార్ని చిలిపిగా ఆటలు పట్టిస్తున్న పెళ్లికొడుకు చెల్లెలు, ఐదునెలల గర్భిణి శిల్ప ఒక్క ఉదుటున ముందుకు తూలి, ఎదుటి సీట్ తాలుకు ఇనపరాడ్ తలకి కొట్టుకుని అక్కడి కక్కడే మరణించింది.

అంతా ఘొల్లుమన్నారు! బస్సు ఆగిపోయింది.

మాలతి పెళ్లికూడా ఆగిపోయింది.

* * *

ఇంచుమించు మరొక ఆరునెలల తర్వాత మాలతి యధాప్రకారం స్కూలుకి వెళ్లి వస్తోంది!

మాలతితో పెళ్లి నిశ్చయమయేసరికే ఆ యింటి ఆడబడుచు స్వర్గానికి వెళ్లిపోయింది. ఇక మాలతి కోడలై వస్తే యింకా ఎన్ని ఉత్పాతాలు జరుగుతాయో అని తాము భయపడుతున్నామని స్పష్టంగా కబురు పంపించి, మాలతికి పెట్టిన ప్రధానపుటుంగరం వెనక్కి తెప్పించుకున్నారు పెళ్లివారు. వాళ్లకి ఎడ్వాన్స్‌గా యిచ్చిన కట్నం తాలూకు ఐదువేలు మాత్రం యివ్వలేదు. అది నష్టపరిహారం క్రింద జమకట్టుకుంటున్నామని కూడా స్పష్టంగానే చెప్పేరు.

వరలక్ష్మి కంటికి మంటికి ఏకధారగా ఏడ్చింది!

"నా కూతురిది దరిద్రపు జాతకం కాదని బల్లగుద్ది మరీ చెబుతాను! అది అడుగు పెట్టిన చోటంతా శుభమే కాని అశుభం ఎప్పుడూ జరగదు! వాళ్ల పిల్ల ఆయుస్సు తీరి చచ్చిపోతే మనపిల్ల ఏం చేసిందండీ?" అంటూ నెత్తికొట్టుకుని ఏడ్చింది.

"పోనీలే లక్ష్మీ! ఎలా జరగవలసి వున్నది అలా జరిగిపోయింది! పోన్లే, యిదీ ఒకందుకు మంచిదే అయింది. పిల్లని వద్దని స్పష్టంగా చెప్పి మంచి పనే చేశారు. పెళ్లి కానిచ్చి దాన్ని రంపపు కోత పెట్టకుండా..." నిర్లిప్తంగా అన్నాడు కాశీపతి.

మాలతి మాత్రం ఏ వ్యాఖ్యానమూ చెయ్యలేదు! మనసులో మాత్రం అనుకుంది "ఈ మాటలూ ఆలోచనా నాకు ఏక్సిడెంట్ అయినప్పుడు ఏమైనాయమ్మా? ఆ రోజు శశాంకనీ అతని జాతకాన్నీ తూలనాడమే?! నీదాకా వస్తే సిద్ధాంతం తారుమారు అయిందా?! మంచికీ-చెడుకీ ఏ వ్యక్తీ కారణభూతుడవడన్నది నీకిప్పటికైనా అర్థమైందా?!"

* * *

ఆ రోజు స్నేహితురాలి కొడుకు బాలసారెకి వెళ్లి వస్తోంది మాలతి. అనుకోకుండా దారిలో వర్షం ప్రారంభమవటంతో చప్పున పక్కనే వున్న పుస్తకాల షాపులోకి వెళ్లింది.

ఎటూ వచ్చాను గదా, ఏద్దైనా నవల కొందామన్న ఆలోచనతో లోపలికి నడిచిన మాలతి ఒక దగ్గర నిలబడి పుస్తకాలు చూస్తున్న వ్యక్తిని చూసి ఆగిపోయింది. అతను శశాంక!

మాలతికి వెంటనే అక్కణ్ణించి పారిపోదామనిపించింది!

ఆమె వెనుదిరగబోయేంతలో శశాంక ఆమెని చూడటం, పలకరింపుగా నవ్వటం జరిగిపోయాయి.

ఇంక తప్పించుకోలేక ఆగిపోయింది మాలతి.

"బావున్నారా..." దగ్గరగా వస్తూ పలకరించాడు.

"చాలా రోజుల నుంచి అనుకుంటున్నాను. మీరు ఒక్కసారి కనిపిస్తే బావుండునని!"

"..."

"మీకేదైనా పనివుందా?"

"ఉహూ... లేదు!"

"అయితే ఒక్క నిమిషం అలా వెళ్లి మాట్లాడు కుందాం వస్తారా?"

ఏమనాలో తోచక ఒక్క క్షణం తికమకపడిన మాలతి చివరికి సరేనన్నట్లు తల వూపింది.

ఇద్దరూ అదే వరసలో వున్న ఒక హోటల్ వైపుగా బయలుదేరారు.

"మాలతీ, యిలా నాతో రావటానికి, నాతో ఫ్రీగా మాట్లాడటానికి మీకేం అభ్యంతరం లేదుగా?" శశాంక మృదువుగా ప్రశ్నించాడు దారిలో.

మాలతి తల వంచుకుని "లేదు" అంది.

ఇద్దరూ హెటల్లోకి వెళ్లి కూర్చున్నారు.

శశాంకే ముందుగా సంభాషణ ప్రారంభించాడు.

"మాలతీ, మీతో నా వివాహం కేన్సిలయి యించు మించు రెండు సంవత్సరాలు కావస్తోంది! కాని నా పెళ్లి మరే అమ్మాయితోనూ జరగపోవటానికి కారణం తెలుసా మీకు?"

మాలతి తెలియదన్నట్లు తలవూపింది.

"అదేమిటో చెప్పబోయే ముందు నేనొక ప్రశ్న అడుగుతాను నిజం చెబుతారా?"

మాలతి మౌనంగానే తలాడించింది.

"మీకు ఏక్సిడెంట్ జరిగాక, మీరు డిశ్చార్జి అయి హాస్పిటల్‌నించి యింటికి వెళ్లిపోయిన రెండవరోజు ఉదయం నేను మీ యింటికి వచ్చాను. మీరు నిద్రపోతున్నారని మీ అమ్మగారు చెప్పారు. సరేనని వెళ్లిపోయి మళ్లీ ఆ సాయంత్రమే వచ్చాను. మిమ్మల్ని ఒక్కసారి చూడాలనే కోరికని అరికట్టుకోలేక! నేను లోపలికి రాకుండానే పొద్దుట మీ అమ్మగారు చెప్పిన విషయం అబద్ధమని తెలిసింది! మీ నాన్నగారు, మీరు, మీ అమ్మగారు మాట్లాడుతున్న మాటలన్నీ తలుపులు తీసే వుండటం చేత ముందుగదిలోకి వచ్చి నిలబడిన నాకు స్పష్టంగా వినిపించాయి! నా స్కూటర్ ఏదో పనుండి నా ఫ్రెండ్ తీసికెళ్లటంతో నడిచి వచ్చిన నారాక ఎవ్వరికీ తెలియలేదు! మీ ముగ్గురి మాటలూ విని స్తంభించిపోయి, నిశ్శబ్దంగా వెనక్కి తిరిగివెళ్లిపోయాను. ఆ తరువాత అనిపించింది-బహుశా మేము మగపెళ్లివారిమై వుండటం వల్లే నా పాదమహిమ వల్లే మీకు ఏక్సిడెంట్ జరిగిందని అనుకోలేకపోయామా అని! మాకు అంటే మా కుటుంబంలో ఎవ్వరికీ ఛాందసభావాలు లేని మాట నిజమే! కాని సెంటిమెంట్స్ సంగతి అటుంచి, నలుగురూ వద్దంటున్న పని చెయ్యటానికి మీ నాన్నగారు చెప్పినట్లు చాలా సాహసం కావాలి! మీరు ఆ సాహసం చెయ్యటానికి సిద్ధపడ్డారు! ఇప్పటికీ నా మనసులో ప్రగాఢంగా మిగిలిపోయిన కోరిక ఒక్కటే మాలతీ..." శశాంక ఆగాడు.

వింటున్న మాలతి మొహం ఎర్రబడింది!

"మీరు ఎలా అనుకున్నా సరే. నేను శశాంకనే చేసుకుంటాను!" అని మీరానాడు ఇన్ డైరెక్ట్‌గా చెప్పారు. మీచేత ఆ మాట అనిపించినది ఏమిటి మాలతీ? నామీద ప్రేమా, లేక జరిగిన సంఘటనలోని అన్యాయమా?" శశాంక మృదువుగా ప్రశ్నించాడు.

మాలతి కళ్లు వాలిపోయాయి! గుండెల్లో సన్నని అలజడి చెలరేగింది! శశాంక ప్రశ్నకి ఏమని సమాధానం చెప్పటం? అందం, చదువు, సంస్కారం అన్నింటిలోనూ ఉన్నతుడైన శశాంకని తను ప్రాణాధికంగా ప్రేమిస్తోందని చెప్పాలా? అతన్ని తలచుకుంటే చాలు, మనసులో శతకోటి ప్రేమ తరంగాలు ఉవ్వెత్తున లేస్తాయని చెప్పాలా? ఏమని చెప్పాలి. ఎలా చెప్పాలి?

మాలతి మొహం రాగ రంజితం అవటం గమనించాడు శశాంక! అతని మనసు కాస్త తేలిక పడింది.

"మాలతీ, ఈ రెండేళ్లనించి ఈ ప్రశ్న మిమ్మల్ని అడగాలని ఎన్నిసార్లు అనుకున్నానో తెలుసా! పగలంతా మనసుని ఏదో ఒక పనితో డైవర్ట్ చేసినా నిద్ర పట్టని రాత్రులు మీమీద ఆలోచనలతో మరింత బరువుగా అనిపించేవి! అప్పటికప్పుడు పరిగెత్తుకొచ్చి మిమ్మల్ని లేపి అడగాలనిపించేది. మీరు నన్ను ప్రేమిస్తున్నానని చెబితే..."

మాలతి ఒక్కసారి కళ్లెత్తి చూసింది! కృష్ణశాస్త్రి చెప్పినట్లు 'ఏదియొ అపూర్వ మధుర రక్తి' స్ఫురింపజేస్తున్నాయి మాలతి కళ్లు.

ఆ కళ్లలోని ప్రేమార్తి శశాంకని ఒక్కసారిగా చలింపజేసింది.

టేబిల్ మీద ముందుకి చెయ్యి జాపుతూ, "మాలా" అన్నాడు.

* * *

"మాలా, మాలా" శశాంక పిలుపుతో మాలతి ఈ లోకంలోకి వచ్చింది.

బస్సు ఆగివుంది. ఏదో స్టేషన్ కాబోలు! పిల్లలు అప్పుడే కిందకి దిగి ప్లాట్ ఫారం మీద నిలబడి తమని రమ్మన్నట్లు చేతులు వూపుతున్నారు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" శశాంక నవ్వుతూ అడిగాడు.

"మీకు తెలిసిందే కదా!" అన్నట్లు చూసింది మాలతి.

"మాలా, నువ్వు యిలా ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్లిపోయి ఆ రోజు హెటల్లో చూసినట్లు చూశావంటే నాకు ఆ ఫ్లాష్‌బ్యాక్‌లో లాగే యిప్పుడూ ప్రవర్తించాలనిపిస్తుంది. తెలుసా?" గునగునగా అన్నాడు శశాంక.

మాలతి అప్రయత్నంగా తన కుడిచేతి వైపు చూసుకుంది!

ఎనిమిది సంవత్సరాల క్రితం హెటల్లో శశాంక చేతిని తొలిసారిగా స్పర్శించి, అతని మొదటి ముద్దుని స్వీకరించిన చెయ్యి అది! □

## ఇరుగు-పొరుగు

### నల్లమందుతో పెళ్లి ఖాయం

మావూళ్లో ఈ మధ్యనే రాజస్థాన్‌కు చెందిన పురోహిత్ రూప్‌సింగ్‌గారి కుటుంబంతో స్నేహం ఏర్పడింది. మొన్న మా మధ్య పెళ్లి విషయాల గురించి చర్చవచ్చింది. వాళ్లు ఇక్కడికి వచ్చి ఐదేళ్లు దాటినందున తెలుగు బాగా మాట్లాడతారు. ఆ రాష్ట్రంలో వారు పెళ్లి ఖాయపరుచుకొనే పద్ధతి వింటే ఒళ్లు జలదరించింది.

పెళ్లి విషయమై అమ్మాయి తండ్రి వచ్చి అబ్బాయి తండ్రితో ఏకాంతంగా మాట్లాడిన తరువాత వారిద్దరి మధ్య అంగీకారం కుదిరితే ఒక మనిషిని పంపి వీధి వీధినా ఫలానా వారింట్లో శుభకార్యం జరుగుతుందని కేకలు వేయిస్తారట. ఆ తరువాత ప్రతివీధి నుండి కొందరు పెద్దమనుషులు అబ్బాయి తండ్రిగారింటికి చేరతారట. వచ్చిన పెద్దలు అమ్మాయి చదువు, వయసు గురించి, అబ్బాయి చదువు, వయసుగురించి వివరాలు అడిగి వారిద్దరూ పరస్పరం సమ్మతించుకున్న విషయం తెలుసుకుంటారట. తరువాత అమ్మాయి తండ్రి తన శక్తిని బట్టి పెళ్లి ఖర్చు యాభైవేలకు తక్కువగా అయితే రూపాయ పావలాను, లక్షవరకయితే ఐదురూపాయలను, లక్షాయాభైవేలవరకయితే పదకొండు రూపాయలను ఆ వచ్చిన పెద్దలలో ఒకరి చేతికిస్తాడు. అతని చేతినుండి ఐదుగురు పెద్దమనుషుల చేతులు మారిన తరువాత ఆరవ చేతిగా అబ్బాయి తండ్రికి ఆ డబ్బును ఇస్తారట. ఆ తరువాత 'నల్లమందు' కొంత తెప్పించి కొయ్యగిన్నెలో వేసి, దానిలో నీళ్లు పోసి నూరుతారట. తరువాత వడపోయగా వచ్చిన నీటిని ఆ వచ్చిన పెద్ద మనుషుల్లో ఒకరు తన అరచేతితోనే అందరి నోళ్లలోనూ (అమ్మాయి తండ్రి, అబ్బాయి తండ్రితో సహా) పోస్తారట. ఈ చివరి తంతు జరిగితేనే ఆ పెళ్లి సంబంధం ఖాయమైనట్లు భావిస్తారట. లేకుంటే ఆ పెళ్లి జరిగేలోపల ఏదైనా పేచీవస్తే ఆ పెద్ద మనుషులు సాక్ష్యానికి కూడా రారట. పెళ్లిని ఖాయపరిచే విషయంలో నల్లమందు ప్రయోగం వారికి ప్రమాణంతో సమానమని విన్నపుడు మనకెంతో ఆశ్చర్యం వేస్తుంది! రాజస్థాన్ రాష్ట్రంలోని అన్ని కులాల వారిలోనూ ఈ ఆచారం అంతగా ప్రాముఖ్యం సంతరింప చేసుకోవటం విశేషంగా వుందనిపించింది.

—బొగ్గరపు ఇందిరాకృష్ణ, పామూరు

* * * *

మీరు వుంటున్న ప్రాంతాలలో ఆంధ్రేతరుల ఆచార వ్యవహారాలు, వివాహ సంప్రదాయాలు, చిత్రమైన కట్టుబాట్లు వంటివి కొన్ని ఇతర ప్రాంతీయులకు వింతగాను, విచిత్రంగాను, ఆసక్తిదాయకంగానూ వుండవచ్చును. వాటి గురించి క్లుప్తంగా, అరఠావు సైజులో ఒక పేజీకి మించకుండా రాసి, (వీలైతే తెలుపు-నలుపు ఫొటోలతో) 'ఇరుగు-పొరుగు' శీర్షికకు పంపించండి. ప్రచురితమైన ప్రతి రచనకూ పారితోషికం వుంటుంది.